ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



రాయదుర్గం: పలుచోట్ల మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్ కాలనీ ప్రధానరోడ్డు పక్కన సర్వీస్ రోడ్డుపై మూడుచోట్ల మ్యాన్ హోళ్లు ఉన్నాయి. వాటికి మూతలు లేకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో పడిపోతే తీవ్రంగా గాయపడే ప్రమాదం లేకపోలేదు. ఈ విషయమై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మధురానగర్ నుంచి ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఔటర్ రింగురోడ్డు, సర్వీస్ రోడ్డు, ప్రశాంత్‌హిల్స్, సాయిఐశ్వర్య, సాయివైభవ్, ఖాజాగూడ, ల్యాంకోహిల్స్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్ వంటి ప్రాంతాలకు ఈ రోడ్డుపై నుంచే వస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉండడంతో అధ్యాపకులు, విద్యార్థులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.





మధురానగర్ కాలనీ వద్ద మ్యాన్‌హోళ్ల పరిస్థితి

'ఇమ్యునో ఆంకాలజీ' పై సదస్సు



కాంటినెంటల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యబృందం

రాయదుర్గం: ఇమ్యునోథెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రముఖ కేన్సర్ పరిశోధకులు డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో కేన్సర్ అవేర్‌నెస్ నెలలో భాగంగా ఇమ్యునో ఆంకాలజీలో అడ్వాన్సెస్‌పై ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయని, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జన్యు ఆధారిత చికిత్సల అభివృద్ధి, చికిత్స నిరోధకతను పరిష్కరించడానికి వ్యూహాలు, వ్యక్తిగతీకరించిన చికిత్సను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించాయన్నారు. పరిశోధకులు డాక్టర్ రమీ ఇబ్రహీమ్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్, మూత్రాశయ, మెదడు, బ్రెస్ట్ కేన్సర్ల చికిత్సా పురోగతిని వివరించారు. కాంటినెంటల్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ వ్యక్తిగత ఇమ్యునోథెరపీ, టార్గెట్ ఇమ్యునోథెరపీపై పలు అధ్యయనాలను వివరించారు. ఇన్ఫర్మేటివ్ సెషన్ కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్, ఇతర డాక్టర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

కొండాపూర్ బెటాలియన్‌లో క్వార్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన స్వాతి లక్రా తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని టీఎస్ఎస్పీ 8వ బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మాణానికి టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా శంకుస్థాపన చేశారు. గురువారం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి ఎం.రమేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.13 కోట్ల వ్యయంతో అధికారులు, సిబ్బంది కోసం 19 క్వార్టర్స్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీ డీఐజీ ఎం.ఎస్.సిద్ధిఖీ, చీఫ్ ఇంజనీర్ కె.సుబ్రహ్మణ్యం, తులసీధర్, ఈఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు.గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత డ్రైనేజీ పనులను హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ కాలనీవాసులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్: బాలికలకు, మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యమని ఎస్ఐ ఆసిఫ్ అలీ అన్నారు.గురువారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం... బాలికలను చదివిద్దాం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు బాలికలు సమస్యలు అధిగమించి చదువుకోవాలని సూచించారు. బాలికలకు వేధింపులు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అల్లంరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ తెల్లాపూర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసి పరిధిలో కన్నా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీల సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.



చిత్రమయిలో ఆర్ట్‌టాక్ షో

మాదాపూర్: కళాకారులు ఆసక్తితో పెయింటింగ్ నేర్చుకోవాలని కళాకారుడు ప్రభాకర్ కోల్టె తెలిపారు. బొంబాయికి చెందిన ప్రభాకర్ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో గురువారం ఆర్ట్‌టాక్ షోను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిత్రకారులకు ఆర్ట్ ప్రాక్టీస్, అబ్‌స్ట్రాక్ ఆర్ట్‌ల గురించి వివరించారు. విద్యార్థులకు అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌లపై మెళకువలను నేర్పించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని కళాకారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం అసెంబ్లీ ఆవరణలో కలిసి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. భాస్కర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల క్రితం ఆల్విన్ కంపెనీ కార్మికులకు ఆనాటి ప్రభుత్వం కొంత మేర నగదు కట్టించుకొని భూమిని అందజేసిందన్నారు. రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డా. సంజీవరెడ్డితో సమస్యను వివరించారు. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఉద్యోగుల ఇళ్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.డి. చంద్రశేఖర్, ఎరగాని నాగన్న గౌడ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి అడ్మిషన్ల కోసం ఈనెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ పాఠశాలలో చదవవచ్చని తెలిపారు. ఆంగ్ల మధ్యమంలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు.

నియామకం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మానవ హక్కుల సంరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సందీప్ కుమార్ నియమితులయ్యారు.గురువారం తెల్లాపూర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని ఆయన తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బంజారా నృత్యాల నడుమ శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఊరేగింపు

శేరిలింగంపల్లి: మాతాజీ, సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బంజార సంఘం ప్రతినిధులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో ఏర్పాటు చేసి బంజార సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ నాయక్, మున్యానాయక్ ఆధ్వర్యంలో ఈ ఊరేగింపును లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, సిటిజన్ కాలనీల మీదుగా హుడా కాలనీ ఫేజ్-2 వరకు కొనసాగింది. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, విష్ణు, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే గచ్చిబౌలి డివిజన్ నేతాజీనగర్‌లో గురువారం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రవినాయుడు, రాయుడు, దశరథ్‌నాయక్, గణేష్, రాజు, ప్రమోద్,సురేష్, విశల్, శంకర్, అనిల్, బాలరాజు, స్థానికులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్/మియాపూర్ : దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకులు, లంబాడాల ఆరాధ్యదైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు చందానగర్ హుడాకాలనీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్‌నాయకులు శ్రీనివాస్ నాయక్, అంజద్ పాషా, మున్య నాయక్, గోపాల్ నాయక్, సుభాష్ నాయక్, అమర్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్

మియాపూర్ నడిగడ్డ తండాలో..

మియాపూర్ నడిగడ్డ తండాలో సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి నాయక్, తిరుపతి నాయక్, హన్మంతు నాయక్, సీతారం నాయక్, తుకారాం దశరద్ నాయక్, గోపి నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ నడిగడ్డ తండాలో వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

ప్రభుత్వ పాఠశాలలో నల్లాలు చోరీ

● పీఎస్‌లో హెచ్ఎం ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలోని వాష్‌రూమ్‌ల నుండి 40 ట్యాప్స్ ఎత్తుకెళ్లారని హెచ్ఎం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జ్యోతి తెలిపిన ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని బాత్‌రూమ్‌లలోని ట్యాప్‌లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని.. యువకుడు మృతి

● మిగతా ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమం



అజయ్ (ఫైల్)

మాదాపూర్: ముగ్గురు యువకులు బైక్‌పై అతి వేగంగా వెళ్తూ చెట్టుకు గుద్దుకోవడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మరణించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకి చెందిన వి.అజయ్(27)విశాఖ ఇండస్ట్రీస్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ, బేగంపేట్‌లో పీజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇతని స్నేహితులు ఎస్.శరత్ (25)ప్రవేటు ఉద్యోగి కాగా అజయ్(25), హోటల్ వర్కర్‌గా పనిచేస్తు మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్, ఖానామెట్‌లో ఉంటున్నాడు. ముగ్గురు చిన్ననాటి స్నేహితులు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున 1.30 గంటలకు అపాచీ బైక్‌ను వి.అజయ్ నడుపుతూ ఖానామెట్ వైపు నుంచి నోవాటెల్ వైపు వెళుతూ మార్గమధ్యంలో న్యాక్ మెయిన్ గేట్ వద్ద ఉన్న 7 సిస్టర్స్ రెస్టారెంట్ దగ్గర అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రెస్టారెంట్ ముందు ఉన్న చెట్టును ఢీకొనడంతో బైక్ నడుపుతున్న వి.అజయ్‌కి బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. మిగిలిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ఇందులో శరత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నాలుగు రోజులు గడుస్తున్నా ఇంటికి రాకపోవటంతో వ్యక్తి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన పల్లపు రవి లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 11న విధులు నిర్వహించేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి నేటి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛ్ ఆఫ్ వస్తుంది. దీంతో రవి సమాచారం తెలియకపోవడంతో తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మరో ఘటనలో.. ఇద్దరు విద్యార్థులు



రాజేష్ (ఫైల్)



జగన్ (ఫైల్)

హఫీజ్‌పేట్ : ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికాస్ అనే వ్యక్తి ఓల్డ్ ఎంఐజీలోని ఎస్ఓఎస్ యూత్ హౌజ్‌ను 9 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నాడు. యూత్ హౌస్‌లో నివాసముండే యు.రాజేష్ (17) 9వ తరగతి, బి.జగన్ (14) 8వ తరగతి బీహెచ్ఈఎల్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రతి రోజు పాఠశాలకు ఉదయం వెళ్ళి సాయంత్రం 5.30 గంటల వరకు యూత్ హౌస్‌కు తిరిగి వస్తుంటారు. ఈ నెల 13వ తేదీ ఉదయం పాఠశాలకు వెళ్ళిన ఇద్దరు విద్యార్థులు తిరిగి రాలేదు. దీంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ జిమ్.. పర్యవేక్షణ నిల్!



గాయత్రినగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో పాడైన జిమ్ పరికరాలు



నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా ఉన్న పార్కు, మొబైల్ టాయిలెట్

● మరమ్మతులకు నోచుకోని పరికరాలు
● విరిగిపోయి నిరుపయోగంగా మారిన వైనం
● పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

మోతీనగర్: ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం లేక రోగాల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలో పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్ జీహెచ్ఎంసీ పార్కు ఆవరణలో, అదే విధంగా మూసాపేట డివిజన్‌లోని పాండురంగనగర్ పార్కు ఆవరణలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఓపెన్ జిమ్‌కు వచ్చి వ్యాయామం చేస్తున్నారు.

◆ జిమ్ పరికరాలు మూణ్నాళ్లకే విరిగిపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఓపెన్ జిమ్‌లపై పర్యవేక్షణ లేకపోవంతో పరికరాలు పాడై నిరుపయోగంగా మారాయి. కనీసం నెలకు ఒక్కసారైనా పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఇటు వైపు చూడలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ట్రైనర్లను ఏర్పాటు చేసి పరికరాలకు మరమ్మతులు చేయిస్తే ఉపయోగపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, యువకులు వ్యాయామం చేయటానికి మక్కువ చూపుతున్నారు. వారికి జిమ్ అందుబాటులో లేకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరికరాలను ఉపయోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

◆ ఇక జిమ్ ఏర్పాటు చేసిన పార్కు ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండి ఉంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. పార్కు సమీపంలో మొబైల్ మరుగుదొడ్డి సైతం అపరిశుభ్రంగా తయారైంది.

◆ పార్కు ఆవరణలో మద్యం సేవించి ఎక్కడపడితే అక్కడ మద్యం సీసాలు, చెత్తాచెదారం పడేస్తున్నారు. వాచ్‌మెన్ లేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవటంతో పర్యవేక్షణ లోపం కారణంగా పార్కు ఆవరణ అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి పార్కు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రైనర్‌ను నియమించాలి

గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సామాన్లు విరిగిపోయాయి. ఇంత వరకు రిపేర్ చేయలేదు. రిపేర్ చేయిస్తే బాగుంటుంది. అదేవిధంగా ట్రైనర్‌ను కూడా నియమించాలి.

– లింగాల ఐలయ్య, లక్ష్మీనగర్

'నీ చూపు చెప్పింది నాకు' పుస్తకావిష్కరణ



మాదాపూర్: వర్ధమాన రచయిత కొరటమద్ది హేమంత్ తొలి నవల 'నీచూపు చెప్పింది నాకు' పుస్తకాన్ని ప్రముఖ నటులు,రచయిత,దర్శకులు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని ఫినిక్స్ ఎరీనాలోని ర్వహించిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఆదిత్య, రచయిత ,నటులు అవసరాల శ్రీనివాస్ ,నిర్మాత వంశీ చాగంటి పాల్గొన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామశాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. తొలి ప్రయత్నంలోనే విశ్లేషణాత్మకంగా రచించిన హేమంత్‌ను అభినందించారు.తనును ఆది నుంచి ప్రోత్సహించిన భరణి, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులకు హేమంత్ ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నల్లగండ్లలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం మాధవానంద సరస్వతిస్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆస్పత్రి ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నల్లగండ్ల వాసులు పాల్గొన్నారు.

పాశమైలారం పారిశ్రామికవాడలో 3 పరిశ్రమలు సీజ్

సీజ్ చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్

పటాన్‌చెరు: పాశమైలారం పారిశ్రామికవాడలో మూడు పరిశ్రమలను అధికారులు గురువారం సాయంత్రం సీజ్ చేశారు. కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, రెవెన్యూ, పీసీబీ వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పాశమైలారం పారిశ్రామికవాడలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మూడు పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలను అమర్చనందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో సీజ్ చేయాలని ఆదేశించారు. దీంతో ఆర్డీఓ రవీందర్, పీసీబీ అధికారులు ఆయా పరిశ్రమలను సీజ్ చేశారు.